# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా అంకిత భావంతో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు.

- ❖ అత్యాదునిక నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

- ❖ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

============================

గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. ఈ రోజు శాసనసభ లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా అంకిత భావంతో ప్రభుత్వం పని చేస్తోందని చేస్తానని పేర్కొన్నారు.

============================

ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ రోజు శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... ఉద్దానం కిడ్నీ సమస్యలకు కలుషిత తాగునీరే కారణమన్నారు. ప్రధానమంత్రి రూపొందించిన జల్ జీవన మిషన్ ద్వారా ప్రతి ఒక్కరికీ శుభ్రమైన తాగు నీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని పేర్కొన్నారు. రక్షిత తాగు నీరు నిరంతరంగా అందించేందుకు ఈ మిషన్ దోహదపడుతుందని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

============================

దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక సాంకేతికత, నాణ్యతలతో ఇళ్ల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. టిడ్కో ఇళ్ల లబ్దిదారుల సమస్యలు త్వరలోనే పరిష్కరించేలా ముందుకెళ్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లపై తీసుకున్న రుణాలకు సంబంధించి శాసనమండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. 2014 లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 7 లక్షల 1 వెయ్యి 480 ఇళ్లకు కేంద్రం నుంచి అనుమతి తీసుకుని 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు కూడా ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి పేదవారికి సైతం గేటెడ్ కమ్యూనిటీ తరహా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇళ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు.

============================

దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాలు మీదుగా ఉపరితల ఆవర్తనం రేపు ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ.. ఈనెల 23న అల్పపీడనంగా మారే అవకాశం ఉందని.... ఆ తర్వాత, ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, తదుపరి రెండు రోజుల లో మరింత బలపడి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలియజేసింది.

============================

విశాఖ జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాలు, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్ ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందిస్తూ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

============================

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వచ్చే జనవరి 20 నుండి 24వ తేదీ వరకు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో మంత్రులు, అధికారుల బృందం వెళ్లనుంది. అక్కడ ముందస్తు ఏర్పాట్లు చేసేందుకు అధికారుల బృందం నిన్న దావోస్ బయల్దేరి వెళ్లింది. డబ్ల్యూఈఎఫ్ సదస్సు సందర్భంగా దావోస్‌లోని రాష్ట్రప్రతినిధులకు అవసరమైన సహకారం, ఏర్పాట్లపై దావోస్ కౌన్సిల్ ప్రతినిధులతో చర్చిస్తుంది. 'షేపింగ్ ద ఇంటెలిజెంట్ ఏజ్' అన్న ఇదివృత్తంతో వచ్చే సంవత్సరం డబ్ల్యూఈఎఫ్ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

విరామం

============================

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడలో బుడమేరు వాగుకు వచ్చిన వరదలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ... బుడమేరు డైవర్షన్ కెనాల్ పూర్తి చేయడంలో గత ప్రభుత్వ

విఫలమైందని  తెలిపారు. అలాగే బుడమేరు డైవర్షన్ కెనాల్ పనుల పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఒకేసారి 15 వేల క్యూసెక్కుల నీరు రావడంతో గండ్లు పడి వరదలు వచ్చాయని తెలుపుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=============================

ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ రోజు  భీమవరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో  కలెక్టర్ మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు భవనాలపైన సోలార్ పలకలను ఏర్పాటు చేయడానికి సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. సోలార్ ప్రాజెక్ట్ ల ఏర్పాటుకు బహిరంగ ప్రదేశాల్లో 10 ఎకరాల వరకు స్థలం ఉండే ప్రాంతాలను గుర్తించాలని తెలియజేశారు.

=============================

బాలల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు చేపడతామని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ రోజు స్థానిక అంబేద్కర్ భవన్ స్టేడియంలో ఐసీడీఎస్, విద్య, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.  ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అపురూపమైన దశ అని, దాన్ని మధురమైన ఘట్టంగా నిలిపేందుకు బాలలకు ప్రత్యేక హక్కులు కల్పించి, వారి రక్షణ కోసం పోక్సో వంటి కఠినమైన చట్టాలను అమలు చేస్తామన్నారు.

=============================

ఖరీఫ్ సీజన్ లో రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ చెప్పారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 25 నుండి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని, దీనికి సంబంధించిన ముందస్తు శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

=============================

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆర్జిత సేవలు, దర్శనానికి సంబంధించిన టోకెన్లను ఆన్ లైన్ ద్వారా విడుదల చేయనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెలకు సంబంధించి ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లను రేపు ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవా, సహస్రదీపాలంకరణ టికెట్లు, 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లను,  23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులకు దర్శన టోకెన్ల కోటాను, అలాగే 24వ తేదీ ఉదయం 10 గంటలకు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా  విడుదల చేయనున్నట్లు టిటిడి ఆ ప్రకటనలో వెల్లడించింది.

=============================

సాంకేతిక పరికరజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా పుస్తక పఠనానికి మించింది లేదని విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఈ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుస్తక పఠనం ఒక అలవాటుగా మార్చుకోవాలని, మహనీయుల జీవిత విశేషాలతో కూడిన పుస్తకాలను విధిగా చదవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన 42 మంది విజేతలకు బహుమతులు అందజేశారు.

==============================

కర్నూల మార్కెట్ యార్డ్ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని జిల్లాలో అన్ని మండలాలో పౌరసరఫాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపట్టాలని శ్రీసత్య సాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

==============================

==============================